# తారాజువ్వ

జువ్వాలును ఇదవరకే మీముందు వుంచాలనుకున్నాను. వాడి కథకు ముగింపు సరియైనది దొరకక యింతవరకు రాయలేదు. జువ్వాలిది, నాదీ ఒక్క ఊరే. వాడు అద్దాలలో బిడ్డడుగా వున్నప్పుడు నేను అయిదో ఫారం చదువు తుండేవాడిని. నాలుగు మైళ్ళలో, పట్నంలోని స్కూలుకు రోజూ మా గ్రామంనించి సైకిలుమీద వెళ్ళేవాడిని. ఒకనాడు స్కూలు నించి వచ్చేసరికి మా అంగడి వీధిలో వాగ్యుద్ధం జరుగుతోంది - మొగుడూ పెళ్ళాల మధ్య. దాలమ్మ గొంతెత్తి గెంతుతోంది. గెంతుతూ మొగుడ్ని తిట్టుంటే వాడు నిషామీదనున్నా పెళ్ళాన్ని పోల్చుకుని కొట్టగలుగుతున్నాడు. పసిపిల్లాడు జువ్వాలును వదిలి చచ్చిపోతానని ప్రక్కనేవున్న యేటిలో పడిపోడానికి వెళ్ళింది. వీరుడైన మొగుడు అట్టే శ్రమపడకుండానే పెళ్ళాన్ని ఒడ్డున చేర్చాడు.

ఈ పోట్లాట నా కళ్ళారా చూశానేమో, ఆ ఘట్టాన్ని ఆధారంగా, నేను క్రొత్తగా కథలురాసే కాలంలో ఒక కథానిక రాసాను. మూడేళ్ళక్రితం నేనో నెలరోజులు మా గ్రామంలో గడిపినప్పుడు దాలమ్మను చూశాను. వయసులో ముదిరి కండలు కొద్దిగా కరిగిన దాలమ్మగొంతుక ధాటి మాత్రం తగ్గలేదు. ఇదివరకే పెద్దకొడుకు పెళ్ళి చేసింది. వాడికో కొడుకు జువ్వాలుకూ యీ

యేడాది పెళ్ళి చేసింది. ఇద్దరు బిడ్డలను యింతవాళ్ళనుజేసి తన అధికారాన్ని వృద్ధి చేసుకుందనుకున్నాను. మొగుడు వసంతు చెయ్యి చేస్తే కొడుకులు పడనివ్వ రనుకున్నాను. తండ్రి కొడ్తుంటే కొడుకు జువ్వాలు మా అంగటి ఇంటి అరుగు మీద మాతో పేకాట ఆడుతూ "మరి రెండు యెయ్యరా అయ్యా, నోరు మూస్తాది" అని అరుస్తున్నాడు. వాడు తక్కువ చదువుకోలేదు. రెండు వెయ్యమంటే నాలుగు వేశాడు. అట్లా దెబ్బలుతిన్న దాలమ్మ నేను పెద్దమనిషినని నా దగ్గరకు పరుగెత్తుకొచ్చింది. "నాయనా, దరమం తెలిసిన బాబువి, మా యింటంతా మారాజులె. నేనొక్కర్తినే బాడిసదాన్ని. ఈ జువ్విగాడికి పేకాట పెద్దోడు దొంగసారా యేపారం యెట్టి ఆడే అంతా తాగేస్తున్నాడు. ఈలయ్య సిన్నోడు కాదు. అవేటికి అరుపదులు నిండుతాయట. సిన్న పిల్లోడిలా యింటికాడ కూకుంటె యీ యింటిల్లపాదీ కడుపులు యెలాగ నింపుతాను?"

"ఆ ముక్కులో కమ్ములమ్మి వారంరోజులు గంజి కాసియ్యే—" అన్నాడు జువ్విగాడు.

"ఈ కమ్ములమ్ముతావా? ఈ బంగారం మా అత్త అత్తది. నా ముక్కులో శుభమని పెట్టింది. నేను కాటికెళ్ళిన్నాడు తియ్యండ్రా."

"అంతవాడివి యింతవాడివయ్యావ్, ఏదైనా పనిలో కెళ్ళకూడదా?" అన్నాను.

"ఊర్లో యేం పనుంది?"

"ఉన్నూర్లోనే అంటే యెలాగ నాయనా? ఏరుదాటి ఎత్తే ఎన్నో పనులు. ఏసినసోటే అడుగులేస్తుంటే యెంత దూరం యెల్తాం? కాటికెళ్ళేదాకా ఈ సోమరిపోతుల్తో నాకు కష్టం తప్పదు గావాల" అంటూ నీళ్ళకడవ పట్టుకుని యేటికి వెళ్ళిపోయింది దాలమ్మ.

జువ్వాలుని జువ్విగాడు చేశారనుకున్నాను. వాడికి తారాజువ్వ అని పేరు పెట్టారట. తారాజువ్వ - జువ్వ - జువ్వ జువ్విగాడుగా చివరకు రూపాంతరం చెందింది. ఈ జువ్విగాడు బతుకునకు అలంకారంగా అందముంది. వాడు నవ్వుతుంటే కొంటెతనం తొంగిచూస్తుంది. బలాన్ని కండల్లో కుదురుగా పొంగి స్తుంటాడు. వీడు అందగాడని అనడానికి నాకు సాహసం యెప్పుడు కలిగిందంటే ఆ రాత్రే గ్యాసులైటు వెలుగులో వాడి ఆడవేషం చూశాక. సిరిసిరిమువ్వ వేషం వేసి చిలకలా పలికి నెమలిలా నృత్యం చేశాడు.

ఆ మరుసటిరోజు వుదయమే వాడ్ని - యేటిలో కమ్మగా పాడుతూ తెప్ప మీద పోతున్నవాడ్ని చూశాను. వరదలో వస్తున్న కలపను వడ్డుకు చేరుస్తు న్నాడు. అంత యెగువగా వచ్చే పెద్ద కర్రను చూసి అంత యెత్తు వారధి నించి నీటిలో గెంతి ఆ కర్రను అనుసరిస్తూ దిగువ రేవులో వడ్డు చేరాడు. మధ్యాహ్నే

నికి అమ్మకాదని దాలమ్మకొడుకు మీద శాపాలు కురిపిస్తుంటే వాడు నవ్వుతూ కనిపించాడు. గ్లాస్కో పంచె కట్టాడు. గేరా గిరిజాలకు నూనె రాసి దువ్వాడు. నోటిలో సిగరెట్ కాల్తోంది. యెరుపు నలుపు చారలున్న బనియను వేసున్నాడు.

వెంటనున్నది పెళ్ళమని పోల్చుకోవడానికి యెంత సేపో పట్టలేదు. నేను యెదుట పడగానే సిగరెట్ నోటినుంచి తీసేసి దాచేస్తూ-

"బాబో-బయస్కోపుకి పట్నం వెళ్తున్నాం. బాబుకు దండం పెట్టే" అజ్ఞాపించాడు. ఆమె దండమెట్టి మెల్లగా తల వంచుకునే కదలిపోయింది.

జువ్విగాడి కంటె అది కొద్దిగా ఛాయ తక్కువైనదేగానీ, సిగ్గొచ్చి నవ్వినప్పుడు శృంగారంగా కనిపించింది వాళ్ళిద్దరూ కంట సిరెట్టని జంటలా కనిపించారు. కులికిపోతూ కదిలిపోయేటప్పుడు కొవ్విన గువ్వజంట యెగిరిపోతున్నట్లున్నారు.

ఆ వారంలో వాడి గరిడీవిద్య నా కళ్ళయెదట్ట పెట్టాడు. నేను వస్తేగాని ఒప్పుకోలేదు. "ఏదో కతలో నన్ను యిరికించి" అన్నాడు త్రోవలో. వాడికున్న శిష్యులూ, సహచరులతో మొగ్గలూ, బరువెత్తడం, మనుషులు పేకముక్క మేడలా ఒకరిమీద ఒకరు నిల్చోవడం, కండలు త్రిప్పడం - ఇవన్నీ చూస్తున్న వారిలో యెదురుగా వున్న యెత్తైన అరుగుమీద - అప్పికూడా వుంది. అతి సుందరంగా వుంది. మొగుడు విజిలు కొట్టి గిరగిర పల్టీలు గాలిలో కొట్టుంటే ఆమె ముఖంలో వెలుగు సిగలో పువ్వులా, మెడకో నగలా మెరిసింది.

అంతా అయిపోయాక నా వెంటే పడ్డాడు. "నా పెళ్ళాం అరుగుమీద నిల్చుంది. సూసావా? అదే మా అత్తోరిల్లు. మాకు ముప్పయి సెంట్ల పొలం - రెండు వాటాలు. కూలి చేస్తే వుంది, లేకపోతే లేదు. అలకు ఆస్తివుంది. ఇదొక్కర్తే ముద్దుకూతురు. నా మొగ్గలు సూసి నన్ను వల్చింది. దాని మామ కన్నేసాడు దానిమీద. ససేమిరా కాదని నా ఎంటపడ్డాది. మా ఇంట్లో వున్ననాడు నాతోటె గెంజి తాగుతాది. లేనినాడు నాతోటే అకలితో తొంగుంటాది- అత్తోరు యిల్లరికం వచ్చిమంటారు. మా అమ్మ, నాయనా, అన్న, వదిన్ని వదిలేసి యెల్తానా?"

"ఊర్లోనే కదా? వెళ్తే ఏం పోయింది?"

"నేను ఆడపిల్లననుకున్నావా బాబూ, అత్తోరింటి కెళ్ళడానికి?"

"ఆ మధ్య ఆడవేషంలో అలాగే కనిపించావ్" అన్నాను.

నాతోపాటు వాడూ నవ్వేసి "ఇలా వేషం వేస్తే, మేమే సక్కటోలం అని అడోలనరు బాబూ....నా కోయదొర దాన్ని తమరు సూడలేదుగానీ....యేసం యేసి గెంతితే వూరు వూరంతా యెంటే వుంటాది."

నేను తిరిగివచ్చేలోగా జరిగిన కొన్ని సంఘటనలలో రెండు మాత్రం చెప్పకుండా వుండలేను. ఒకటి అన్నదమ్ములిద్దరి పోట్లాట. నీవు ఖర్చు పెట్టేస్తున్నావంటే నీవు ఖర్చుపెట్టేస్తున్నావని. అది యెంతవరకు వెళ్ళిందంటే భూమి, ఇల్లూ పంచేమని అన్న ఖచ్చితంగా చెప్పేశాడు. దానికి కారణం ఆవేళ జువ్వాలు పెళ్ళానికి వాడికిష్టమైన నేరడిపండు రంగు చీర కొనటమే. ఆ దెబ్బలాటలో నాకింకో విషయం తెలిసింది. జువ్విగాడు కోపంలో అన్నాడు: "పోలీసులు నిన్ను ఖైదులో పెట్టానికియెత్తే వదిన ముఖం చూసి నేనెల్లి మూడ్నెల్లు సారా అమ్మేనని అబద్ధం సెప్పి జైల్లో కూర్చున్నారా. అప్పుడెంత మురిసిపోయావురా? నేనానాడు ఆ పని సెయ్యకపోతె నివ్వీనాడు కొడుకు నెత్తుకుని వుందువురా?"

రేపు వచ్చేస్తాననగా యీ రాత్రి వెన్నెల రాత్రి నేను మా అంగటి అరుగు మీద కూర్చున్నాను. వెన్నెలతో వికసించిన ఆకాశం యేటిలో మునిగిపోయి వెలుగును వెదజల్లుతోంది. గగనమంతా గంతులేస్తున్న గాలి చల్లదనంతో బరువెక్కి మెల్లగా కదుల్తోంది. జువ్వగాడి గొంతుక వినిపించింది. వాళ్ళయింటి యెదరగా నున్న బయలు ప్రదేశంలో ముందు వాడూ, పెళ్ళాం అప్పీ కనిపించారు. నన్ను చూస్తే ఆ పాట, పాటకు తగ్గ ఆట ఆగిపోతుందని కొబ్బరిచెట్టు చాటు నిల్చుని చూస్తున్నాను. "నోమినోమన్నాల నోమన్నలాలో చందమామో" ఆ పాట నన్ను వుప్పొంగించి పులకలు వెయ్యించి, తరవాత చేరిన అందరితో పాటు నేను చప్పట్లు చరిచాను, గెంతులేశాను. నాకూ ఈ ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన ఆభరణాలలో భాగముందన్నట్లు గర్వపడ్డాను.

నేను తిరిగి వెళ్ళిపోయినా ఆ దివ్యానుభూతి నించి చాల రోజులవరకూ వేరుపడలేకపోయాను. నాకు ఆ నేరడిపండురంగు చీరతో ఆ రాత్రి సరియైన వంపులతో శిల్పి చెక్కిన గంధర్వ కన్య ప్రాణంతో కదలినట్లు, హుందాగా వెల్లివిరిసి, యౌవనాన్న వుప్పొంగిపోయిన గోదావరిలా యెగసించిన జువ్విగాడినీ ఈ జంట విడవని జంటనీ....వీళ్ళ గురించి ముగింపు తెలియక యీనాటి వరకు యెన్నిసార్లు ప్రయత్నించినా చేతకాక రాయలేకపోయాను.

ఏడాదిక్రితం మా వూరునించే వచ్చిన మా మేనమామని జువ్విగాడి గురించి అడిగాను.

"ఆ వెధవ - పాడైపోయాడురా" అన్నాడు.

"అంటే...."

"దొంగ అయిపోయాడు."

"ఎంచేత?"

"ఇంట్లో పండినకొద్దీ కాజేసి అమ్మి పేకాట ఆడేస్తాడు."

"డబ్బు గెలిచాడా?"

"సులువుగా డబ్బు చేసుకుని వాడ త్తవారంత వాడనవ్వాలనుకున్నాడు."

"అన్నదమ్ములు సఖ్యంగా వున్నారా?"

"అన్నదమ్ములు విడిపోయారు."

"పెళ్ళాం బాగుందా? పిల్లలు కలిగారా?"

"అది మొగుడినివదిలి కన్నారింటికి వెళ్ళిపోయింది."

నేను "నమ్మ" నన్నాను.

"వీడు ఒకసారి వూళ్ళో కోమటివాళ్ళ యిల్లు కాలిపోతుంటే చొరవచేసి లోపల మంచం మీద నున్న పిల్లను బయటకు తెచ్చాడు. వీడి కుడి బుగ్గ కాలి పోయింది. అది తగ్గినా ఆ మచ్చ అంత అందమైన ముఖానికి లోటు తెచ్చింది."

"అదిచూసే వెళ్ళిపోయిందా వాడి పెళ్ళాం?"

'కాదు. ఇంట్లో జరుగుబాటు తక్కువ. తండ్రి, తల్లి, వీడికే దాపు రించారు. వసంతు పని చెయ్యలేదు. నవనవ లాడుతున్న అప్పి నరంలా అయి పోయింది. కన్నవారింట్లో తిండితో తేలుకుంది. వాళ్ళు అల్లుడ్ని యింటికి రమ్మంటారు. వీడు వెళ్ళడు "

"వీడు బెంగ పెట్టుకున్నాడా?"

"అలాగే వెర్రోడిలా తిరిగేవాడు. దానికిష్టమైన పాటలు పాడేవాడు. ఒకనాడు జ్వరం. ఆ మరుసటిరోజుకు తగ్గింది. గైరమ్మ వుత్సవం. మొగ్గలు వెయ్యడానికి వెళ్ళాడు. అత్తవారింటి యెదుట పెళ్ళాన్ని, చూడగానే జువ్వలా లేచాడు. ఆ చుట్టుప్రక్కల యెవరో యిల్లు కట్టిస్తున్నారు. కొండరాళ్ల పడు న్నాయ్. అవి చూసుకోకుండా మొగ్గలు వేశాడు. సరైన తిండివుంటేగదా శక్తి వుండడానికి, అలా మొగ్గలేస్తూ పెళ్ళాం వైపు చూస్తూనే వున్నాడు. అది యింటి కొస్తాదని యెదురు చూస్తున్నట్టే నిల్చుంది. మొగ్గలు వేస్తూ ఒక రాయిమీద పడ్డాడు. గండెరాయిమీద మోసింది. అక్కడి కక్కడే రక్తం కక్కుకున్నాడు. ఎంతో తంటాలుపడ్డారు. పట్నం తీసుకెళ్ళాడు. కొద్దిరోజులు బాగుంటాడు. మళ్ళీ రక్తం కక్కుకుంటాడు. చచ్చిపోతాడు అన్నంత గాబరా చేస్తుంది. నాకేం కాదంటాడు, కోడిమాంసం, పందిమాంసం అన్నీ తినేస్తాడు. మళ్ళీ జబ్బు...."

"అయితే అప్పి మనువు తెంపుకుందా?"

"తల్లీ తండ్రీ యెంత చెప్పినా యింకో మొగుడికి పోలేదు."

"ఇంత జబ్బు చేసినా మొగుడి దగ్గరకు రాలేదా?"

"వచ్చింది. ఇంటికి రమ్మని బతిమాలింది. వాడు వెళ్ళేదు."

"ఏమైనా పిల్లలు పుట్టారా?"

"లేదు."

ఇంత తెలుసుకున్నా, నాకు జువ్విగాడి కథకు ముగింపు తెలియలేదు తెలుసుననుకున్నా అలా నాకు రాయటం యిష్టలేదు. ఎలాగో ఒకలా రాసి ఒక గ్రామంపైన తన ఆటలతో, పాటలతో, ఆవేశంతో, అభిరుచులతో, అమృతం వర్షింపజేసిన యీ వ్యక్తికి అన్యాయం చేయటం నా కిష్టంలేదు. జువ్విగాడి పేరు వాడి రూపు, వాడి చేష్టలు, వాడి నవ్వూ, గారడీలు - వేషాలు, యీ లోకంలో యే కొద్దిమందో చూసివుంటారు. కానీ నాకు వాడిలో మానవత్వం వెలుగుతున్నట్లు కనిపిస్తుంది.

ఇంకా నేను వాడి ఆకారం మరచిపోలేదు. ఆ వారధినుండి వరదవెల్లువ లోనికి గెంతే సాహసాన్ని మరచిపోలేదు వాడి సిరిసిరిమువ్వ వేషంలో ఆ పెద్ద కంటిరెప్పలతో నా వేపు చూసి గీటిన కనుగీటుని మరచిపోలేదు. వెన్నెల్లో పాడుతూ పెళ్ళాంతో చేసిన లయబద్ధమైన నాట్యం నన్ను యిప్పటికీ వెంటాడు తుంటుంది.

నేను యింకోసారి మా వూరు వచ్చేపుడూ నా కెదురైనది ఒక రెండు పోతుల బండి. వాడి యింటి యెదర నిల్చింది. పోతులు వదిలేశారు. ఆ గూడు లేని మోటుబండి మీద ఎండు గడ్డిమీద ఒక బక్కచిక్కిన మనిషి వెల్లకిలా పడు న్నాడు. వసంతు నోటమాట పెగల్లేను తల్లి తలకొట్టుకుంటూ "నా నాయనా - నీకిప్పుడే నూరేళ్ళు విండాయిరా!" అని యింట్లోకి పోతూ త్రోవలోనే కూలబడి పోయింది.

నాకు ఆ నోటా ఈ నోటా అందిన సమాచారం యిది: నాలుగురోజులై రక్తం వాంతి అవుతుంటే నాటు వైద్యుడు దగ్గర మందు తెచ్చారు. వాడు చివ రకు లాభంలేదు, పట్నం ఆసుపత్రికి తీసుకవెళ్ళి పోమన్నాడు. దాలమ్మ ఇన్నాళ్ళు ఆకలి దహించుకపోయిన్నాడు కూడా అమ్మని ముక్కు కమ్మలను తీసి అమ్మేసి కొడుకును ఆసుపత్రికి తీసుకువెళ్ళింది. వాళ్ళు లాభం లేదన్నారు. ఆసుపత్రి బయట ఒడిలో కొడుకును వేసుకుని బస్సు వాళ్ళని యెక్కించమంటే త్రోవలో చస్తాడు మాకెందుకన్నారు. బండివాడినడిగితే శవాన్ని మొయ్యటానికి యిరవై రూపాయలన్నాడు.

"నా కొడుకు ప్రాణంతో వున్నాడు. ప్రాణంతో వున్నాడు" అని అరిచింది. ఊరిబండి ఒకటి పట్నం వచ్చింది. ఎలాగున్నాడని చూడటానికి వచ్చినవాళ్ళు వాడ్ని ఈ బండిమీద వేసుకొచ్చారు. సగందూరం వచ్చాక పోయిం దనుకున్న ప్రాణం వచ్చింది. ఇంటి అరుగుమీద వేశారు. నేను చాలా సేపు దగ్గరగా కూర్చున్నాను. దాలమ్మ వర్ణించి వర్ణించి యేడుస్తోంది. ఆ శోకగీతి విశ్వాంతరాలకు వినిపిస్తున్నట్లుంది. అందులో సంగీతం వుంది. వాడి రంగు రంగుల జీవితం ఒక హరివిల్లు పొడిచినట్లుగా పశ్చిమ ఆకాశం కనిపించింది.

జువ్విగాడికి తెలివి రాలేదు. కాని, పెద్దవూపిరి తీస్తున్నాడు. ఇంకా ప్రొద్దు క్రుంగిపోలేదు. కళ్ళు తెరిచాడు. చిన్నమాట పెగిలింది. వాడిమాట విని అంతవరకు యేడుస్తున్న అన్నయ్య దగ్గరకు వచ్చాడు. సైగ చేశాడు. అన్నయ్య కాస్త నోట్లో నీరు పోశాడు. గుటుక వేయడానికి ప్రయత్నించాడు. తరవాత అప్పి తన కోరిక ప్రకారం దగ్గరకు వచ్చింది. కెవ్వుమంది. మీద వాలి పోయింది. ఇంతవరకు వయసొచ్చిన ఒళ్ళుతో ఈ ఒక్క శరీరాన్ని తాకింది. కానీ ఈ శరీరం యిదివరలా నరాల పొంగుతో వెచ్చగా లేదు. చల్లగా వుంది. తలమీద చెయ్యి వెయ్యమన్నట్లు సైగ చేశాడు. ఆమె ఆ గిరిజాల జుత్తులోనికి చెయ్యి పోనిస్తూ అంత మంది వున్నారని అనుమానించకుండా మీదపడి ముద్దులాడేసింది. జువ్విగాడు చచ్చిపోతూ నవ్విన నవ్వును చూసే అదృష్టవంతులలో నేనొక్కడి నయ్యాను.

ప్రొద్దు క్రుంగిపోయింది. నేను యింటికి వచ్చేసాను.

నేను మరికొన్నాళ్ళు మా వూరిలో వున్నాను. వసంత యేడుపుతో గొంతుక పట్టుకపోయినా తరవాత పెరిగింది. ఏడ్చిన అన్నయ్య జువ్విగాడి వాటా యింటినికూడా వాడుతున్నాడు. అప్పి యింకో మనువుకు వెళ్ళిపోవడానికి యింకేం ప్రతిబంధకం లేదని వూర్లో అనుకుంటున్నారు. కానీ తల్లి ప్రాణం - తల్లీ కొడుక్కీ వున్న సంబంధం, వాడు పసిపిల్లవాడుగా వున్నప్పటినుంచీ చచ్చి పోయేవరకూ యింతో అంతో చూశాను. తెలుసుకున్నాను. ఆమె వాడు చని పోయి నెలదాటినా యేదో సమయంలో తల్చుకుని యేడుస్తుంది. నేను యీ వేళ ఆమె ఏడుపులో విన్నదేమంటే - "ఇంత నన్ను అన్యాయం చేసినందుకి నీ కడుపులో ఒక కందవున్నా చూచి మరచిపోదునురా తండ్రీ....!" *

(1969)